క్లుప్తంగా

ఫైనాన్స్ వ్యాపారిపై హత్యాయత్నం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో సోమవారం రాత్రి ఫైనాన్స్ వ్యాపారిపై హత్యాయత్నం జరిగింది. ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాయకుపాలెం గ్రామానికి చెందిన సలాది రాంబాబు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. వసూళ్ల కోసం రోజూ మాదిరిగానే వేగాయమ్మపేట వెళ్లాడు. వసూళ్లు పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఊరి చివర ఇద్దరు వ్యక్తులు యాక్సిడెంటు అయ్యిందంటూ నాటకీయంగా రాంబాబు వాహనాన్ని ఆపారు. రాంబాబు ఆగిన వెంటనే వెనుక నుంచి కత్తితో దాడి చేసి గాయపరిచారు. రాంబాబు వేగంగా వాహనాన్ని నడుపుకొంటూ ద్రాక్షారామ వైపునకు వస్తూ దారి మధ్యలో స్పృహ తప్పి పడిపోయాడు. సమాచారం ఫోన్లలో తెలుసుకున్న బంధువులు అక్కడికి చేరుకుని వైద్యం కోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి, ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. పక్కా సమాచారం అందిన తరువాత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్సై వినోద్ విలేకరులకు తెలిపారు.

రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాట ముహూర్తం చేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఏడో తేదీ వరకు స్వామివారి కల్యాణం జరగనుంది. ఈ మేరకు సోమవారం ఉదయం 9.07 గంటలకు ఆలయ కార్యనిర్వహణాధికారి పీటీవీవీ సత్యనారాయణ(తారకేశ్వరరావు) చేతుల మీదుగా అర్చకులు వేదపండితులు అభిషేక పురోహితుల వేద మంత్రాల నడుమ రాట ముహూర్తం చేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం: చిన కోరుమిల్లిలో ఏర్పాటు చేసిన 45 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా సాగుతున్నాయి. గ్రామ ప్రజల సౌజన్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠ పూజలు 22న ప్రారంభం కాగా గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 26న ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నారు. అదే రోజు భారీ అన్నదానం నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల కాలికి గాయం

మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కాలికి గాయమైంది. ఇంటి వద్ద మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో ఆయన కాలి ఎముక క్రాక్ ఇచ్చినట్టు వైద్యులు గుర్తించారు. కాలికి సిమెంట్ కట్టు వేసి ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద ఉన్న ఆయనను సోమవారం కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టాభిమారామయ్య చౌదరి, పారిశ్రామిక వేత్త వేగుళ్ల చైతన్యబాబు, మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి పరామర్శించారు.

కల్యాణమస్తు దరఖాస్తుల పరిశీలన

కపిలేశ్వరపురం: గ్రామాల్లో వైఎస్సార్ కల్యాణమస్తు షాదీ తోఫా పథకానికి వచ్చిన దరఖాస్తులను సోమవారం ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో పరిశీలించారు. మండలంలోని మాచర, వాకతిప్ప, పడమర ఖండ్రికలలో మొత్తం 5 దరఖాస్తులందాయన్నారు. అర్హత గల వివాహమైన మైనారిటీ దంపతులకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకూ ఆర్థిక సాయమందుతుందని తెలిపారు. ఆయా దరఖాస్తులను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించారు.

చివరి దశకు స్వామిత్వ సర్వే

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే దాదాపు చివరి దశకు చేరుకుంది. నేలటూరు తదితర గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి చేయగా వెదురుమూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లో సర్వే చివరి దశకు చేరుకుంది. సచివాలయ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో శ్రమించి సర్వేను పారదర్శకంగా చేశారు. కాగా సర్వేకి సంబంధించిన మ్యాప్‌లను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కాజులూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జన్మదినం సందర్భంగా గొల్లపాలెంలో సోమవారం పార్టీ రాష్ట్ర నాయకుడు చుండ్రు వీర్రాజుచౌదరి అధ్యక్షతన చిక్కాల కేక్ కట్ చేశారు. గ్రామంలోని యువకుడితో టీస్టాల్ ఏర్పాటు చేయించి, రూ.50 వేల విలువైన సామగ్రి అందజేశారు.

సమయం లేదు మిత్రమా..!

- ప్రాధాన్యతా ప్రశ్నలపై దృష్టి పెట్టాలి
- మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- కరోనా కారణంగా తొలగించిన సిలబస్ సైతం చదవాలి
- విద్యార్థులకు తర్ఫీదునిస్తున్న అధ్యాపకులు



అంగర కళాశాలలో చదువుకుంటున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల టైమ్ టేబుల్‌ను ప్రకటించారు. మార్చి 15 నుంచి ప్రథమ, 16 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు థియరీ పరీక్షలు రాయనున్నారు. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లో 14 కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. 90 శాతం సిలబస్ పూర్తికావడం, సమయం తక్కువ కావడం, పాఠ్యాంశాల్లో మార్కుల ప్రాధాన్యతలపై విద్యార్థులకు అధ్యాపకుల సూచనలు, సలహాలు ఇలా...

లాంగ్వేజీలపై ప్రత్యేక దృష్టి



మొత్తం మార్కుల్లో లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు సైతం కలుస్తాయి. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గ్రామర్‌కూ, ప్రశ్నా జవాబులకూ సమ ప్రాధాన్యతనివ్వాలి. కోవిడ్ కారణంగా తెలుగు ఫస్ట్ ఇయర్‌లో తొలగించిన నందీశ్వరుని శాపం, కపాల మోక్షం, అప్పుడే పుట్టి ఉంటే, గాన సుభాకరుడు మంగళంపల్లి, కుంకుడాకు, ఎచ్చరిక పాఠాలను, సెకండ్ ఇయర్‌లో తొలగించిన శాంతి కాంక్ష, కర్మభూమిలో పూసిన ఓ పువ్వా, మన ఆటలు, వేమన కవిత్వాలను పునరుద్ధరించారు. పద్య, గద్య భాగాల్లోంచి వ్యాసరూప, ఉపవాచకం నుంచి 4 మార్కులు, అన్నింటి నుంచీ మూడు మార్కుల ప్రశ్నలొస్తాయి. సెకండ్ ఇయర్‌లో హనుమస్సందేశంలో పద్యాలను తరచూ ఇస్తుంటారు.

– కె.శేఖర్, తెలుగు అధ్యాపకుడు, మండపేట

లెక్కల్లో నూరుశాతం అవకాశం



అన్నింటికీ సమ ప్రాధాన్యతనివ్వడం ద్వారా 75 మార్కులనూ పొందే అవకాశం ఉంది. మేథ్స్ 1ఏలో మాత్రికలు, ప్రమేయాలు, త్రికోణమితి, నిష్పత్తులు, పరివర్తనాలు, త్రిభుజ ధర్మాలు, సదిశల సంకలనం, సదిశల గుణనం, అతి పరావలయ ప్రమేయాలకు, 2ఏలో డీమూవర్స్ థీరం, సంభావ్యత, యాదృశ్చిక చలరాశులు, ద్విపద సిద్ధాంతంలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– గ్రంధి సురేష్, మ్యాథ్స్ అధ్యాపకుడు, అంగర

వ్యాసరూప ప్రశ్నలపై దృష్టి



ప్రథమ సంవత్సరంలో డోలనాలు, ఉష్ణగతిక శాస్త్రం, పని-శక్తి, సామర్థ్యం, పదార్థ ఉష్ణ ధర్మాల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తాయి. ద్వితీయ సంవత్సరంలో కేంద్రకాలు, తరంగాలు, ప్రవాహ విద్యుత్ పాఠ్యాంశాల నుంచి వ్యాసరూప ప్రశ్నలూ, మిగిలినవన్నింటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తుంటాయి.

– బలుసు ధన ప్రసాద్, ఫిజిక్స్ అధ్యాపకుడు, నల్లూరు

ఎక్కువ మార్కులు వచ్చే చాప్టర్లపై దృష్టి సారించాలి



ప్రథమ సంవత్సరంలో రాజనీతిశాస్త్రం పరిధి స్వభావం, జాతి-జాతీయత, హక్కులు బాధ్యతలు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వంలపై దృష్టి సారించాలి. ద్వితీయ సంవత్సరంలో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు-ఆదేశిక సూత్రాలు, కేంద్ర కార్య నిర్వాహక శాఖ, కేంద్ర శాసన నిర్మాణ శాఖ, భారత దేశంలో స్థానిక, ప్రభుత్వాలు, ఏపీ, భారత దేశంలలో ఇటీవల పరిణాలపై దృష్టి సారించాలి.

– కె.రవికుమార్, పౌరశాస్త్ర అధ్యాపకుడు, ద్రాక్షారామ

చిత్ర పటాలు తప్పనిసరి



బోటనీ ఫస్ట్ ఇయర్‌లో జీవ వైవిధ్యం, ప్రత్యుత్పత్తి విధానాలు, కణం నిర్మాణం, పుష్పించే మొక్కలలో లైంగిక ప్రత్యుత్పత్తి మొక్కల నిర్మాణాత్మక సంశిధానం-స్వరూప శాస్త్రాలను నుంచి అధిక మార్కులొచ్చే అవకాశం ఉంది. బోటనీ సెకండ్ ఇయర్‌లో వృక్ష శరీర ధర్మ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, మానవ రంక్షేమంలో మొక్కలు, సూక్ష్మ జీవులకు ప్రాధాన్యతనివ్వాలి.

– చుక్కా సురేష్ కుమార్, బోటనీ అధ్యాపకుడు, కె.గంగవరం

కర్బన రసాయన శాస్త్రానికి ప్రాధాన్యమివ్వాలి



కోవిడ్ కారణంగా ఫస్ట్ ఇయర్‌లో తొలగించిన పర్యావరణ రసాయన శాస్త్రం, సెకండ్ ఇయర్‌లో తొలగించిన లోహ నిష్కర్షణలో సాధారణ సూత్రాలు, పాలిమర్‌లు, నిత్య జీవితంలో రసాయన శాస్త్రాలను పునరుద్ధరించారు. వాటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తాయి. ఫస్ట్ ఇయర్‌లో కర్బణ రసాయన శాస్త్రం, మూలకాల వర్గీకరణ- ఉపవర్తన ధర్మాలు, పరమాణునిర్మాణం, సెకండ్ ఇయర్‌లో విద్యుత్ రసాయశాస్త్రం- రసాయనిక గతికశాస్త్రం, పి.బ్లాక్ మూలకాలకు ప్రాధాన్యతనివ్వాలి.

– వేల్పూరి రఘురాం, కెమిస్ట్రీ అధ్యాపకుడు, అంగర

అధిక మార్కులు దక్కే అవకాశం ఉంది



కోవిడ్ కారణంగా ఫస్ట్ ఇయర్‌లో తొలగించిన ఉమ్మడి కుటుంబం, సహకార సంఘాలు, వ్యాపారవిత్తం మూలాధారాలు-2, తప్పుల సవరణ, సెకండ్ ఇయర్‌లో తొలగించిన కంప్యూటరైజ్డ్ అక్కౌంటింగ్, పార్టనర్ షిప్‌లో పదవీ విరమణ, మరణం పాఠ్యాంశాలను పునరుద్ధరించారు. అవన్నీ ప్రాధాన్యతగలవే. వ్యాపారవిత్తం మూలాధారాలు-2 నుంచి 17 మార్కులు, ఎంట్రప్రెన్యూర్ నుంచి 14 మార్కులు వచ్చే అవకాశం. ఫస్ట్ ఇయర్‌లో వ్యాపార వ్యవస్థ స్వరూపాలు, భాగస్వామ్య వ్యాపార సంస్థ, జాయింట్ స్టాక్ కంపెనీ స్థాపన, వ్యాపార విత్తం మూలాధారాలు-01, సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు, బహుళజాతి సంస్థలు, సెకండ్ ఇయర్‌లో వినియోగదారీ రక్షణ, ఫైనాన్షియల్ మార్కెట్, బిజినెస్ సర్వీసెస్, ఫంక్షన్స్ ఆఫ్ కమర్షియల్ బ్యాంకింక్, ప్రిన్సిపల్స్ ఆఫ్ ఇన్సూరెన్స్‌లపై దృష్టి సారించాలి.

– ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకుడు, మండపేట

పేదలకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు, కూళ్ల, భట్లపాలిక గ్రామాల్లోని ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన పేద కుటుంబాలకు పోలిశెట్టి చంద్రశేఖర్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా పేదలకు బియ్యం నిత్యావసరాలు అందజేశామని జనసేన నాయకుడు, ట్రస్టు నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సంపత్, గుబ్బల శ్రీనివాస్, నల్ల వెంకటేష్, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి న్యూటాలెంట్ అవార్డు



న్యూటాలెంట్ అవార్డు అందుకుంటున్న కృష్ణమూర్తి

కె.గంగవరం: గ్రామానికి చెందిన విద్యావేత్త, సంఘ సేవకుడు, శ్యామ్ ప్రసాద్ స్కూల్ ప్రిన్సిపాల్ కొల్లి కృష్ణమూర్తి న్యూటాలెంట్ అవార్డును అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రుద్ర స్టూడియో అందించే న్యూటాలెంట్ అవార్డును స్టూడియో సభ్యులు సునీతరెడ్డి, రుద్రా శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. న్యూటాలెంట్ అవార్డు అందుకోవడంపై మండలానికి చెందిన సుదర్శన దొరబాబు, నేమాని రామకృష్ణ చౌదరి, ఏఓ రవిబాబు తదితరులు కృష్ణమూర్తిని అభినందించారు.

పోలమ్మ ఉత్సవానికి బందోబస్తు

రాయవరం: గ్రామ దేవత పోలమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి నేతృత్వంలో మండపేట సీఐ శివగణేష్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. జాతరకు వివిధ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. 100 మంది వరకు సిబ్బందితో బందోబస్తు ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతల ఎంపిక



విజేతకు బహుమతి అందజేస్తున్న దాత గిరి, డీఎం వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలోని యానం రూట్ బస్సు సర్వీసుల్లో ప్రయాణించిన వారికి ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం విజేతలను సోమవారం డిపోలో డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డ్రా తీసి ఎంపిక చేశారు. కాపులపాలెంకు చెందిన ఎస్.రాజేష్‌కుమారికి మొదటి బహుమతి, మాచవరానికి చెందిన ఎం.సూర్యనారాయణకు రెండో బహుమతులను దాత, మారుతి కట్ పీసెస్ అధినేత గిరి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



రామచంద్రపురంలో నేతాజీ బోస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నేతలు

మండపేట: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని సోమవారం స్థానిక ధర్మగుండం వద్ద సుభాష్ చంద్రబోస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ నాయకుడు బళ్ల నాగు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర పోరాటంలో నేతాజీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి చైర్‌పర్సన్ దుర్గారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగు మిత్రబృందం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు గ్రంధి శ్రీనివాస్, మలసాని సీతామహాలక్ష్మి, పిల్లి శ్రీనివాస్, పారిశ్రామికవేత్త కొనగళ్ల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, తాడి రామారావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

రామచంద్రపురం: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జయంతిని రామచంద్రపురం నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయం వీధిలోని నేతాజీ విగ్రహానికి పట్టణ బీజేపీ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నేత కొట్టువాడ హరిబాబు నేతాజీ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం స్వీట్లు పంచారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యాండ్ర బుల్లబ్బులు, ఉపాధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణ, కార్యదర్శి మాధవభట్ల కృష్ణమూర్తి, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ సత్యవాడ హరిబాబు తదితరులు పాల్గొన్నారు. బ్రాడీపేటలో జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు మహ్మద్ బాబ్జి నేతృత్వంలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అడ్వైజరీ బోర్డు సభ్యుడు కంచుమర్తి బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడుతూ దేశ భక్తిని కలిగిన నేతాజీ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గొల్లపల్లి కృష్ణ, బయలపూడి రామకృష్ణ, పెదపాటి బోసు, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

మండపేట: పాస్టర్ల సంక్షేమానికి పాస్టర్ల ఫెలోషిప్ కృషి చేస్తోందని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ డేనియల్‌పాల్ అన్నారు. గ్రామీణ ప్రాంత పాస్టర్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశం డేనియల్‌పాల్ అధ్యక్షతన సోమవారం స్థానిక ఏసుక్రీస్తు మహిమ ఆవరణలో జరిగింది. జిల్లాలోని రీజనల్, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలకు చెందిన సంఘ నాయకులు హాజరై పలు అంశాలపై చర్చించారు. డానియల్ పాల్ మాట్లాడుతూ ఫెలోషిప్‌లోని పాస్టర్ సంక్షేమానికి ఇప్పటికే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. పాస్టర్లు అందరికీ ఆర్థిక భరోసా కల్పించేలా నూతన పథకానికి రూపకల్పన చేసినట్టు తెలిపారు. ఫెలోషిప్ నాయకులు జాన్‌ప్రభాకర్, శామ్యూల్‌సిన్నీ, ధనరాజ్, వీపీ శామ్యూల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నయనానందం..విద్యుద్దీప తేజం



ఆకట్టుకుంటున్న స్వాగత ద్వారాలు



అబ్బుర పరుస్తున్న కదిలే రొయ్య

ఆకట్టుకుంటున్న ఎల్‌ఈడీ లైటింగ్

రాయవరం: గ్రామంలో జరుగుతున్న పోలమ్మ జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ సోయగాలు పలువురిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం జాతర జరగనున్న నేపథ్యంలో సోమవారం రాత్రికి పూర్తి స్థాయిలో ఎల్‌ఈడీ బల్బులతో లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. బిక్కవోలు మండలం కొంకుదురుకు చెందిన బాబూరావు, కలకత్తాకు చెందిన పరమేశ్వర్ పోటాపోటీగా లెడ్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.



అలరిస్తున్న మినీ స్వాగతద్వారాలు



అబ్బుర పరుస్తున్న కదిలే తాబేలు

పూర్వ విద్యార్థుల సందడి



నరసాపురపుపేటలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ 2002–03 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకుని సందడి చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు శైలజ, పద్మావతి, నాగలక్ష్మి, రాంబాబు, నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమం నిర్వహణను చేపట్టిన కాశి సుబ్రహ్మణ్యం, కె.వీరభద్రరావు, కేవీవీ సూర్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, ఎం.సుజాత, ఎం.హైమవతిలకు స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది



ఆర్థిక సహకారాన్ని విద్యార్థులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: గ్రామాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారాలు ఎన్నటికీ మరువలేనివని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ విద్యలో ప్రతిభ కనబరుస్తున్న ఎంపీసీ విద్యార్థులు టి.దుర్గాప్రసాద్, వి.న్యూష్య, ఎం.ప్రశాంత్, బైపీసీ విద్యార్థులు ఎస్.లీలాసత్య, సుప్రియ, ఎం.సుజిత, ఎం.తేజస్వి, సీఈసీ విద్యార్థులు కె.రాణి, ఎస్.సునీత, ఎ.దుర్గమ్మ, హెచ్‌ఈసీ విద్యార్థులు బి.విజయ, ఎ.వీరమణిసురేంద్ర, ఎ.మానస తదితర విద్యార్థులకు హైద్రాబాద్‌కు చెందిన జామి రామకృష్ణ రూ 12 వేలు చొప్పున ఆర్థిక సహకారాలు అందజేయగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తన మిత్రుడిని పేద విద్యార్థులకు ఆర్థిక సహకారానికి కృషిచేసిన కళాశాల లైబ్రేరియన్ వి.భీమేశ్వరరావుని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించింది.

బాలికలు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డీఎస్పీ బాలచంద్రారెడ్డి తదితరులు

రామచంద్రపురం రూరల్: బాలికలు విజ్ఞాన శాస్త్రం అభ్యసించి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని వెంకటాయపాలెం పేపకాలయ బాబ్జీ కల్యాణ మండపంలో ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా రవికుమార్ చేతుల మీదుగా జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకోవాలన్నారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ బాలికలకు సైన్స్‌పై అభిరుచి పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ కార్యదర్శి బుద్ధా శ్రీనివాస్ మ్యాజిక్, విద్యార్థులు శాస్త్రవేత్తలుగా చేసిన ఏకపాత్రాభినయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డీఎస్పీ బాలచంద్రారెడ్డి, అతిథులు చేతుల మీదుగా గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్య సుబ్రహ్మణ్యం, రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయండి

రామచంద్రపురం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 27న విశాఖపట్నంలో జరిగే మహాగర్జనను జయప్రదం చేయాలని పలువురు కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా సీపీఐ, ఏఐటీయూసీ, ఆధ్వర్యంలో సోమవారం నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్ష శిబిరాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వి.గోపాలరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించే విధంగా ఈనెల 27న జరిగే మహాగర్జనకు కార్మికులందరూ తరలిరావాలని పలుపు నిచ్చారు. ఈ దీక్షా శిబిరాన్ని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏఆర్‌కే రాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి జి.రాజు, సీపీఐ న్యూడెమొక్రసీ నాయకులు జి.సూరిబాబు, కాంగ్రెస్ నేత గాలింకి చిట్టిబాబు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకుడు గొల్లపల్లి కృష్ణ, పీడీఎస్‌యూ నేత బి.సిద్దూ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్ష శిబిరం

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ భూమి పూజ



హసన్‌బాదలో కమ్యూనిటీ హాలుకు భూమి పూజ చేస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రతిపాదనతో మంజూరు చేసిన జెడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ బోస్ సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీ యన్నం దేవి, ఎంపీ బోస్ తనయుడు సూర్యప్రకాష్, పంచాయతీ రాజ్ డీఈ చింతా భూషణప్రసాద్, ఏఈ దాసరి యేసురత్నం, పంచాయతీ కార్యదర్శి భాస్కరలక్ష్మి, వీఆర్ఓ సూర్యకుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.